క్లుప్తంగా

బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



మేయర్ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న మోతే రోహిత్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఇటీవల అంబర్‌పేటలో వీధికుక్కల దాడిలో మరణించిన బాలుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని యువజన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ డిమాండ్ చేశారు. సోమవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ మేయర్ చాంబర్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాలుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఆందోళన చేస్తున్న యువజన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



ఆలె భాస్కర్‌తో సత్తిరాజ్ ముదిరాజ్

గోల్కొండ: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకుడు ఆలె భాస్కర్ అన్నారు. షేక్‌పేట్‌కు చెందిన ఓబీసీ మోర్చా నాయకుడు సత్తిరాజ్ ముదిరాజ్ సోమవారం ఆలె భాస్కర్‌ను కలిశారు. కార్యకర్తలంతా సమష్టిగా తమ తమ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

సమస్యలను పరిష్కరించండి



వాటర్‌బోర్డు మేనేజర్‌తో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: జాంబాగ్ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా, సివరేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలని హిందీనగర్ వాటర్‌బోర్డు మేనేజర్ సోమశేఖర్‌కు బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. హిందీనగర్‌లోని కార్యాలయంలో ఆయన మేనేజర్ సోమశేఖర్‌తో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, మహ్మద్ గౌస్, సయ్యద్ యూసుఫ్, జహంగీర్, అక్బర్, మహ్మద్ ఆసీఫ్, నిజాం, జాకీర్ మేరాజ్ పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

గోల్కొండ: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. హోలీ, షబ్-ఏ-మేరాజ్ పండుగను పురస్కరించుకుని సోమవారం గోల్కొండలో పీస్‌అండ్ మైత్రి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రత పరిరక్షణలో పీస్‌అండ్ మైత్రి కమిటీ సభ్యులు దశాబ్దాలుగా పోలీసులకు సహాయ సాకారాలు అందిస్తున్నారని ఆయన అన్నారు. మైత్రి కమిటీ సభ్యులు సివిల్ దుస్తుల్లో పోలీసులు లాంటివారని, వారి వల్లే తాము స్థానికంగా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించగల్గుతున్నామన్నారు. పీస్ కమిటీ సభ్యులు ఆబెద్ భాయ్, ఆజమ్ ఖాన్, పూస వేణుగోపాల్, షానవాజ్ ఖాన్ తదితరులున్నారు.

'లూడో' తెచ్చిన గొడవ

స్నేహితుడిని కత్తితో పొడిచిన వైనం

చాంద్రాయణగుట్ట: లూడో గేమ్ వివాదం కారణంగా ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నవాబుసాహెబ్‌కుంట ప్రాంతంలో ఆదివారం రాత్రి బిలాల్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్, షరీఫ్ లూడో ఆడుతున్నారు. ఈ ఆటలో గెలుపోటముల విషయమై గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆరీఫ్‌ఖాన్ పేపర్ కటర్‌తో బిలాల్‌ఖాన్ కడుపులో పొడవగా ఇందుకు షరీఫ్ కూడా సహకరించాడు. ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

హోలీ వేడుకలకు సర్వం సిద్ధం

- భక్తిశ్రద్ధలతో కామదహనం
- హోలీలో మార్వాడీల ప్రత్యేకత..
- ఆర్గానిక్ రంగులను వినియోగించాలంటున్న వైద్య నిపుణులు

చార్మినార్: హోలీ పండుగను ఈసారి ఘనంగా జరుపుకోవడానికి పాతబస్తీ ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం కామదహనం భక్తిశ్రద్ధలతో జరిగింది. పాతబస్తీ మినీ భారత్ లాంటిది. ఇక్కడ స్థానికులతో పాటు ఉత్తర భారతీయులు, బెంగాలీలు, తమిళులు, మలయాలీలు, కన్నడిగులు స్థిరపడ్డారు. పాతబస్తీలోని వివిధ ప్రాంతాలలో స్థిర నివాసాలేర్పరుచుకున్న ఉత్తర భారతీయులు తమదైన ప్రత్యేక శైలిలో హోలీ ఉత్సవాలను నిర్వహిస్తారు. హోలీ వేడుకల్లో సింథటిక్ కలర్స్ కాకుండా ఆర్గానిక్ రంగులను వినియోగించి.. చర్మాన్ని, కళ్లను కాపాడుకోవాలని వైద్యులు కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల వారు..

పాతబస్తీ గుల్జార్‌హౌస్, పత్తర్‌గట్టి, మామాజుమ్లా పాఠక్, కోకర్‌వాడి, శక్కర్‌కోట, బండికా అడ్డా, పేట్ల బురుజు, మూసాబౌలి, హైకోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో మార్వాడీలు, బెంగాలీలు, కన్నడియులు, జైన్‌లు, మరాఠీలు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరి లైఫ్ స్టైల్‌తో పాటు ఉత్సవాల్లో కూడా వీరి ప్రత్యేకత కనిపిస్తుంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యారల్స్‌లలో నీళ్లు నింపి పసుపు, ఆకుపచ్చ, నీలం, పింక్ రంగులను తయారు చేసి బంధు మిత్రులను అందులో ముంచేస్తారు.

మార్వాడీల ప్రత్యేక పూజలు..

గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన అగర్వాల్ కుటుంబీకులు తమ బంధు మిత్రులతో కలసి ఆనందోత్సాహాల నడుమ హోలీ వేడుకల్లో పాల్గొంటారు. కామదహనం రోజు అగర్వాల్ కుటుంబీకులు రెండు మూడు రోజుల ముందుగానే కామదహనం కోసం తమ ఇళ్లలో పిడకలతో చందమామ, నక్షత్రాలు, టెంకాయల ఆకారాలను తయారు చేసి ఎండ బెడతారు. వీటిని కామదహనం



పాతబస్తీలో రంగుల విక్రయాలు

రోజు వీధులలో ఏర్పాటు చేసిన కట్టెలలో వేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వాడవాడలా భక్తిశ్రద్ధలతో కామదహనం..

కామదహనం సందర్భంగా పాతబస్తీలోని వివిధ కులాలకు చెందిన మహిళలు వారి సంప్రదాయాల కనుగుణంగా కామదహనం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పూజలు నిర్వహించారు. కొంత మంది కామదహనం అనంతరం ఏర్పడిన బూడిదను ప్రత్యేకంగా ఇంటికి తీసుకెళ్లారు. ఉత్తర భారతీయులు కామదహనం సందర్భంగా చెరుకు గడను కట్టెలతో పాటు పేరుస్తారు. నిప్పు పెట్టిన అనంతరం ఈ



మీరాలంమండిలో ..

చెరుకు గడను అమాంతం బయటకు లాగుతారు.

సందడిగా మార్కెట్లు..

హోలీ సందర్భంగా పాతబస్తీలోని మీరాలంమండి, చార్మినార్, గుల్జార్‌హౌజ్, గౌలిపురా, ఉప్పుగూడ, ఛత్రినాక, లాల్‌దర్వాజా, అలియా బాద్, బ్రహ్మణ వాడి, చాంద్రాయణగుట్ట, పురానాపూల్, దూద్‌బౌలీ తదితర ప్రధాన మార్కెట్లు వివిధ రంగుల దుకాణాలతో సందడిగా మారాయి.

మీరాలంమండిలో ..

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో మీరాలంమండిలో సోమవారం రాత్రి కామ దహనం భక్తి శ్రద్ధలతో జరిగింది.

సందడిగా కామదహనం..

గోల్కొండ: హోలీ పండుగ సందర్భంగా సోమవారం షేక్‌పేట్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో కామదహనం సందడిగా సాగింది. షేక్‌పేట్ హరిజన బస్తీ, నానల్‌నగర్, హకీంపేట్, గోల్కొండ మహల్లాగంజ్ తదితర ప్రాంత్లాలో యువకులు పాత కట్టెలు, పాడైన వస్తువులతో ప్రత్యేక పూజలు నిర్వహించి కామదహనం నిర్వహించారు.

"మోదుగు పూల కలర్ వాడండి



ఆయుర్వేద పరంగా మోదుగు పూలు చర్మ రక్షణకు మేలు చేస్తుంది. చర్మాన్ని కాపాడడంలో దివ్య ఔషధంగా పని చేస్తుంది. చలికాలం నుంచి ఎండా కాలంలోకి అడుగుపెడుతున్న తరుణంలో హోలీ వేడుకలొస్తాయి. అంటే ఎండల నుంచి తమను తాము రక్షించు కోవడానికి మోదుగు పూలతో హోలీ వేడుకలను నిర్వహిస్తే..చర్మంపై ఒక పలుచని పొర ఏర్పడి ఎండ వేడిమిని తట్టుకునేటట్లు చేస్తుంది. ఇప్పటికీ మధుర, బృందావన్ పట్టణాల్లో హోలీ వేడుకలను మోదుగు పూల రంగులతోనే నిర్వహిస్తున్నారు.

– సురేందర్ శర్మ, ఘాన్సీబజార్, ఆయుర్వేద వైద్యుడు

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్

చాంద్రాయణగుట్ట: స్వచ్ఛ సర్వేక్షణ్‌ను–2023 కార్యక్రమాన్ని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై చాంద్రాయణగుట్టలోని గ్రేస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్థానిక ఓపెన్ పాయింట్లలో చెత్తను వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటో టిప్పర్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. నాలాలు, చెరువులు, కుంటలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ నిషేధమన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా పర్యవేక్షించాలన్నారు. బస్తీ దవాఖానాలు, అన్నపూర్ణ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ బాధ్యతలు అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, డీసీలు జయంత్, అలివేలు మంగతాయారు, రిచా గుప్తా, సూర్యకుమార్, రాజేందర్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు నిరంతర కృషి

అబిడ్స్: సమాజ సేవకు గడ్డం గంగాధర్ ఫౌండేషన్ నిరంతర కృషి చేస్తుందని చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. అబిడ్స్ నేతాజీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు యూనిఫాంలను అందజేసి మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ మనోరమ్మ గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సుదర్శన్, తిరుపతయ్య, వినోద్‌కుమార్, సాంబశివరావు, సునిల్‌రావు, చాంద్‌బాయి, శివకుమార్, అరుంధతి, రాజేశ్వరీ, రేఖ పాల్గొన్నారు.



అంగన్‌వాడీని సందర్శించిన గడ్డం శ్రీనివాస్ యాదవ్

రెండు వర్గాల మధ్య ఘర్షణ

- కార్పొరేటర్ కుమారుడితో సహా పలువురిపై కేసు

అబిడ్స్: రెండు గ్రూపులకు మధ్య జరిగిన గొడవలో మంగళ్‌హాట్ కార్పొరేటర్ కుమారుడితో పాటు మరికొంత మందిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ఇందిరానగర్‌లో ఓ టెంట్‌హౌస్‌లో పనిచేసే రాజు స్థానికంగా ఉన్న కార్పొరేటర్‌కు చెందిన కార్యాలయంలో షట్టర్ తెరిచి నిద్రకు ఉపక్రమించాడు. సోమవారం విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కుమారుడు అకిల్ అతని స్నేహితులు డానియల్, అమోజ్ కలిసి రాజును నిలదీయడంతో పాటు అతడిపై చేయి చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన రాజు సంబంధీకులు నరేందర్‌గౌడ్, శేలేందర్ గౌడ్, సంతోష్ కలిసి కార్పొరేటర్ కుమారుడిని నిలదీస్తుండగా వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ కుమారుడితో పాటు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

'అర్హులందరికీ మచ్చీమార్కెట్‌లో దుకాణాలు కేటాయిస్తాం'

అబిడ్స్: అర్హులందరికీ బేగంబజార్ మచ్చీమార్కెట్‌లో దుకాణాలు కేటాయిస్తామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నందకిశోర్‌వ్యాస్ బిలాల్ మచ్చిమార్కెట్‌లో డీలర్ల వివరాలను రవికిరణకు అందజేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన ఆధునాతన మచ్చి మార్కెట్‌లో అర్హులైన వారందరికీ దుకాణాలు కేటాయిస్తామన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. వెంటనే డీలర్లందరికీ దుకాణాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎంతో కృషితో ఆధునాతన మచ్చీమార్కెట్ నిర్మించారన్నారు. అర్హులైన డీలర్లందరికీ దుకాణాలు కేటాయించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు పప్పు మాత్రే, శైలేష్ కురుమ, ప్రదీప్ రాజ్, ఫతేసింగ్, రమేష్, శివ, దర్శన్ సింగ్, జైపాల్ సింగ్, గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌కు వివరాలు అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

విద్యార్థులకు అండగా మజ్లిస్

గోల్కొండ: విద్యార్థులకు మజ్లిస్ పార్టీ అండగా ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకిలో 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాషలో చదివే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా మాతృభాష ప్రతి విద్యార్థికి సులువుగా అర్థమవుతుందని, ఇటువంటి విద్యార్థులు ఆంగ్లంపై కూడా పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో సైతం వీరు ర్యాంకులు సాధించడం ఖాయమన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తాను తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. మజ్లిస్ పార్టీ తరఫున సాలార్ ఏ మిల్లత్ మాడల్ పేపర్స్‌ను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్ అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మద్యం దుకాణాలు బంద్

చార్మినార్: హోలీ పండుగను పురస్కరించుకుని పాతబస్తీలోని వైన్స్ దుకాణాలతో పాటు బార్ అండ్ రెస్టారెంట్‌లను మూసి వేస్తున్నట్లు చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 8వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల వరకు వైన్స్ దుకాణాలతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లు మూసి ఉంటాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పాతబస్తీలోని వైన్స్, బార్ దుకాణాలను మూసి ఉంచాలని ఆయన సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నామన్నారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన

దూద్‌బౌలి: టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన లభిస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు పెద్దోజు రవీంద్ర చారి అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు సోమవారం చార్మినార్ నియోజకవర్గంలో ఆయన ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భరత్ ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ శంకర్ ముదిరాజ్, జోగిందర్ సింగ్, బి.వై.శ్రీకాంత్, దండు రాంచందర్, ఒగ్గు బాల్‌రాజ్, జి.చంద్రశేఖర్, టి.నాగరాజు, ఎండీ చాంద్, షేక్ ఖయ్యూం, షరీఫ్, షేక్ దస్తగీర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేకు కొత్త సొబగులు



మొక్కలు అమర్చుతున్న దృశ్యం

గోల్కొండ: మెహిదీపట్నంలోని పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కొత్త సొబగులు అద్దుకుంటుంది. ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్లకు గతంలో వేసిన మొక్కలు వివిధ కారణాలతో వాడిపోయాయి. దీంతో ప్రభుత్వం సరికొత్తగా మెహిదీపట్నం రైతుబజార్ వద్ద గల పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే యూ టర్న్‌కు ఇరువైపులా ఉన్న పిల్లర్లకు వెర్టికల్ గార్డెన్‌ను పునరుద్ధరిస్తున్నారు. మెహిదీపట్నం నుంచి లంగర్‌హౌస్, టోలిచౌకి వెళ్లే మార్గంలో కూడా ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్లకు కొత్త హంగులు దిద్దుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని పిల్లర్లకు కింది నుంచి ఫ్లై ఓవర్ పై భాగం వరకు ఉన్న పిల్లర్లకు కొత్తగా ప్లాస్టిక్ జాలి బిగించి అందులో మొక్కలు నాడుతున్నారు. ఒక్కో పిల్లర్‌కు సుమారు 25 నుంచి 35 వరకు వివిధ రకాల మొక్కలు నాటుతున్నారు.

శోభన్‌బాబు అభిమానుల సభ జయప్రదం చేయాలి

నాంపల్లి: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహానటుడు శోభన్‌బాబు అభిమానులను ఒకే వేదికపైకి తీసుకు వచ్చేందుకు శ్రీవాణి గిరిజా సంగీత నాటక కళా సమితి ముందుకు వచ్చింది. మే 17న ఉదయం నుంచి సాయంత్రం వరకు రవీంద్రభారతి వేదికపై శోభన్‌బాబుతో అభిమానులకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ఒక మహత్తరమైన యజ్ఞతుల్యంగా సాగే సభకు అభిమానులతో పాటుగా పలువురు మంత్రులు, సినిమా నటులు, హాజరవుతారని పద్యనాటక రంగస్థల నటుడు, శ్రీవాణి గిరిజా సంగీత నాటక కళా సమితి అధ్యక్షుడు వెంకట్ రాజు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. శోభన్‌బాబు అభిమానుల సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన జీవితంపై తాను రచించిన 'స్థితప్రజ్ఞుడు'అనే పుస్తకాన్ని ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని వాణిజ్యపన్నుల శాఖ ఎన్జీఓల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల ప్రదీప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పంజాబ్‌లోని మోహాలీలో మార్చి 12 నుంచి జరిగే అఖిలభారత సివిల్ సర్వీస్ క్రికెట్ పోటీల్లో తెలంగాణ తరపున పోటీ చేసే క్రికెట్ జట్టుకు ఎంపికైన చార్మినార్ డివిజన్ ఉప రాష్ట్ర పన్నుల అధికారి బాలాజీరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావుల ప్రదీప్ కుమారెడ్డి మాట్లాడుతూ.. వాణిజ్య పన్నుల శాఖ తరపున అధికారి అయిన బాలాజీ రావు క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎన్నిక కావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. బాలాజీరావు మాట్లాడుతూ.. పంజాబ్‌లో జరిగే క్రికెట్ పోటీలో తెలంగాణ జట్టు విజయం సాధించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ రహ్మత్ అలీ, అబ్దుల్ మాలీక్, దేవులపల్లి శ్రీనివాస్‌రావు, మల్యాల మధు తదితరులు పాల్గొన్నారు.



బాలాజీరావును సన్మానిస్తున్న ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ రహ్మత్ అలీ తదితరులు

మేదర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేస్తున్న బాలచందర్ తదితరులు

విజయనగర్‌కాలనీ: మేదర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మహేంద్రా (మేదరి) సంఘం నాయకులు సోమవారం ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఫర్హీన్ షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాంపల్లి నియోజకవర్గం మహేంద్రా సంఘం నాయకులు శీలం బాలచందర్ మాట్లాడుతూ.. మన పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాలలో మేదరి కులం ఎస్టీ జాబితాలో ఉందని, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో మాత్రమే బీసీ జాబితాలో కొనసాగుతుందని పేర్కొన్నారు. అనగారిన మేదరి కులస్తుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి చొరవ చూపి త్వరితగతిన ఎస్టీ జాబితాలోకి మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, సత్యనారాయణ, కుమార్ మహేంద్ర, వినోద్ కుమార్, శివ, శ్రీశైలం, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

ఇన్‌ఫెక్షన్ సోకకుండా చర్యలు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ సోకకుండా చేపట్టాల్సిన చర్యలపై హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్య ఎస్. నాయర్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందన్నారు. ఆస్పత్రి కింది స్థాయి సిబ్బంది నుంచి నర్సింగ్ స్టాఫ్, వైద్యులు ఎవ్వరి విధులు వారు సక్రమంగా నిర్వహిస్తే ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు తగ్గుతాయని అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అందరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే ఇన్‌ఫెక్షన్‌ను పూర్తిగా నివారించవచ్చని అన్నారు. ఏఓ డాక్టర శ్రీనివాసరావు, డాక్టర్ గోపాల్, డాక్టర్ కవితతో పాటు నర్సింగ్ స్టాఫ్, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్య ఎస్. నాయర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అవార్డులను ప్రదానం చేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు తదితరులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఈడీ పురుషోత్తమ్ నాయక్ తదితరులు

నాంపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. సోమవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు లలిత కళాతోరణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.వి.రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు, యువతులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసిన ఆయన ప్రసంగించారు. సెట్విన్ సంస్థ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు నాణ్యమైన శిక్షణ అందించడంలో విశేషంగా కృషి చేస్తోందన్నారు. రాణీ కుముదినీ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెట్విన్ సంస్థలో శిక్షణ పొందుతున్న మహిళలు నిర్వహించిన స్టాల్స్‌ను డాక్టర్ కె.వి.రమణాచారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ కాట్రగడ్డ హరిత, ఏజీపీఈ సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ లిన్నె ఒగ్గు, సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ టి.ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదించాలి

గన్‌ఫౌండ్రీ: మహిళా బిల్లును పార్లమెంటు ఉభయ సభలలో ఆమోదించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు మహిళా విశిష్ట కీర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మహిళా బిల్లు పార్లమెంటులో మగ్గిపోవడం విచారణకరమన్నారు. జనాభా దామాషా ప్రకారం మహిళా బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సినీనటులు దివ్యవాణి, రాగిణి, ప్రీతి నిజం, కూచిపూడి నృత్య గురువులు డాక్టర్ ఆర్.ప్రసన్నరాణి, ప్రొఫెసర్ రేఖరావు, వణజా ఉదయ్, అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిళా కవి సమ్మేళనం ..

గన్‌ఫౌండ్రీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధార్మిక జనమోర్చా తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సద్భావన–మహిళామణి అనే అంశంపై పలువురు మహిళా రచయితలు తమ కవిత్వాలను వినిపించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి మాట్లాడుతూ.. మహిళల కోసం ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు మహిళా రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయితలు గిడుగు కాంతి కృష్ణ, రమాదేవి, సంఘం వ్యవస్థాపకులు మహ్మద్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అఫ్జల్‌గంజ్: ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే అన్ని విభాగాల్లో పోటీ పడుతున్న మహిళలు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో అన్ని రంగాల్లో పై చెయ్యి సాధించాలని టీఎస్‌ఆర్‌టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తమ్ నాయక్ ఆకాంక్షించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంజీబీఎస్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన ఆర్టీసీ మహిళా కండక్టర్లను, సిబ్బందికి బహుమతులు అందజేశారు.

రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో..

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో రంగోలి, పాటలు, మ్యూజిక్ చైర్ తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు, గ్రంథాలయ మహిళా సిబ్బందిని గ్రంథాలయ ముఖ్య పాలకులు ఏవీఎన్. రాజు ఘనంగా సన్మానించారు.

ఫారూఖ్‌నగర్ డిపోలో..

చాంద్రాయణగుట్ట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంఓ విజయ భాను అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫారూఖ్‌నగర్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహిళా ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో కూడా మహిళలు కండక్టర్లుగా పెద్ద ఎత్తున ఉద్యోగాలు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావ్ పాఠశాల ప్రిన్సిపాల్ రేణు, డిపో మేనేజర్ భద్రీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కరుణ శ్రీ పాల్గొన్నారు.